మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
శుక్రవారం | 24 | ఏప్రిల్ | 2026 | పేజీలు : 12

# అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా మారుస్తాం



- 160 గిగా వాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంలో 50 శాతానికి పైగా సాధించాం
- విద్యుత్ భారాన్ని భరిస్తున్నాం..విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తున్నాం
- నాడు ప్రొక్లెయిన్లతో కూల్చివేతలు..నేడు అభివృద్ధి పనులు
- కిల్లర్ పార్టీని దూరంగా పెట్టండి
- రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌కు చెందిన రెండు ప్లాంట్లకు సీఎం చంద్రబాబు భూమి పూజ



**అనకాపల్లి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రజలపై విద్యుత్ భారాన్ని వేయకుండా... ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందని... అలాగే విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. జాతి నిర్మాణంలో భాగంగా రెన్యూవబుల్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం చెప్పారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు గరువారం భూమిపూజ నిర్వహించారు. రూ.5,400 కోట్లతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాంబిల్లి పెట్టుబడులు పెట్టనుంది. సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబు భూమి పూజ చేశారు. రూ.4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, రూ.1200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టును రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 2100 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."అనకాపల్లి జిల్లా భారీ పెట్టుబడులతో అభివృద్ధిని ఆకర్షిస్తోంది. పెట్టుబడుల్లో ఈ జిల్లా భారత్‌లోనే అగ్రస్థానానికి చేరుతుంది. ఇటీవలే ఆర్సెలార్



మిట్టల్ నిప్పాన్ ఇండియా స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ సంస్థ 6.5 గిగావాట్ల ఇన్ గాట్ సోలార్ వేఫర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా వెనుకబడిన ప్రాంతం. కానీ ఇప్పుడు ఆ జిల్లానే అత్యంత సంపద కలిగిన ప్రాంతంగా మారింది. విశాఖ సమీపంలోని అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుంది. కేంద్ర మాజీమంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు 2వ పేజీలో

## ఈ-కేవైసీ వేగవంతం చేసి పాస్ పుస్తకాల జారీకి చర్యలు : విశాఖ జిల్లా కలెక్టర్



**విశాఖపట్నం , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** గ్రామీణ మండలాల పరిధిలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదార్ పాసుపుస్తకాల జారీకి సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి గురు వారం నిర్వహించిన 2వ పేజీలో

## క్షేత్ర స్థాయిలో మహిళా సంరక్షణ పోలీసుల విధులు క్రియాశీలకం : ఎస్పీ



2వ పేజీలో

## క్షేత్ర స్థాయిలో మహిళా సంరక్షణ పోలీసుల విధులు క్రియాశీలకం : ఎస్పీ

**ఒకటి తరువాయి**

**విజయనగరం , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** పూసపాటిరేగ జంక్షన్ వద్ద సెయింట్ ఫ్రాన్సిస్ స్కూలు విద్యార్థులతోను, మహిళా సంరక్షణ పోలీసులతోను ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ గురువారం మమేకమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్– బ్యాడ్ టచ్ గురించి, మహిళా సంరక్షణ పోలీసులకు క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎప్పుడూ ఒంటరిగా ఉండ వద్దని, తల్లిదండ్రులు, టీచర్స్ లేదా సురక్షితమైన స్థలాల్లో మాత్రమే ఉండాలన్నారు. అవకాశాల కోసం ఎదురు చూసే వ్యక్తులు పిల్లలకు చాక్లెట్స్, ఐస్ క్రీం, బిస్కెట్స్ ఆశ చూపి, వారిపై లైంగిక అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తమను ఎవరు ప్రలోభ పెట్టినా, తమతో ఎవరు బ్యాడ్ గా ప్రవర్తించినా, వెంటనే విషయాన్ని తల్లిదండ్రులు లేదా టీచర్స్ కు తెలియజేయాలన్నారు. తమ తల్లిదండ్రులు రహదారి ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా ప్రయాణించేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలన్నారు. తల్లి, తండ్రి, బాబాయ్, మామయ్య, తాత య్య ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్ళే సమయంలో పిల్లలు వారిని హెల్మెట్ ధరించాలని కోరాలన్నారు. పిల్లల పట్ల పెద్దవాళ్ళ ఎంతో ప్రేమతో ఉంటారని, సురక్షిత ప్రయాణం కోసం పిల్లలు చెప్పిన విషయం వారిని ఆలోచింపజేస్తుందని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతోపాటు, ఇతర భద్రత ప్రమాణాలను పాటిస్తారన్నారు. విద్యార్థినులకు తప్పనిసరిగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే చాలా స్కూల్స్ కు మహిళా సంరక్షణ పోలీసులు, శక్తి టీమ్స్, మహిళా కానిస్టేబుళ్ళు సందర్శించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మైనరు విద్యార్థులు అవగాహన లేని కారణంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన ఉంటే మోసగాళ్ళు చెప్పే మాయమాటలు వినకుండా ఉంటారన్నారని తెలిపారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులతో మాట్లాడుతూ వారు నిర్వహించాల్సిన విధులపట్ల అవగాహన కల్పించి, దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో మహిళా సంరక్షణ పోలీసులు నిర్వహించాల్సిన విధులు చాలా క్రియాశీలకమైనవని అన్నారు. తమ పరిధిలోని గ్రామ/వార్డులో నివాసం ఉ ండే ప్రజలకు సైబరు మోసాలు, గంజాయి, డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలను, రహదారి భద్రత, శక్తి యాప్ పనితీరు, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంరక్షణ పోలీసులు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలను ప్రతీ రోజూ నిర్వహిస్తే ప్రజలు సైబరు మోసాలకు, లైంగిక వేధింపులకు, దాడులకు గురికాకుండాను, డ్రగ్స్కు బానిసలుగా మారకుండా ఉంటారన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావానికి గురైతే ఏవిధంగా లక్ష్యానికి దూరం అవుతారో, వారి జీవితాలు నాశనమవుతాయో వివరించాలన్నారు. యువత గంజాయి ప్రభావానికి గురికాకుండా అప్రమత్తం చేయాలని, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగు చేయాలని, గంజాయి కేసుల్లో నిందితులుగా మారితే ఏవిధమైన కఠిన శిక్షలను న్యాయస్థానాలు విధిస్తాయో వివరించాలని ఎం.ఎస్.పి.లకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో సహాయ, సహకారాలను అందించాలన్నారు. గంజాయి నిర్మూలన ఏదో ఒక శాఖకు చెందిన అంశం కాదని, అందరూ భాగస్వామ్యులైతేనే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు పూసపాటిరేగ పోలీసులు రూపొందించిన పోస్టర్స్ ను ఆవిష్కరించి, వాట్ని ఆటోలకు అతికించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఎస్.రాఘువులు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్ఐ ఐ.దుర్గా ప్రసాద్, ఎం.ఎస్.పి.లు, స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ-కేవైసీ వేగవంతం చేసి పాస్ పుస్తకాల జారీకి చర్యలు : విశాఖ జిల్లా కలెక్టర్


**ఒకటి తరువాయి**

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన జిల్లాలో ప్రగతిని వివరించారు. ప్రస్తుత విధానాన్ని సమీక్షించి అవసరమైన మార్పులు చేస్తూ, లోపాలను సవరించి కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. స్పష్టమైన టైమ్ షెడ్యూల్ అమలు చేసి, పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. తప్పులను సవరించి ఈ–కెవైసీ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ అంశాలపై సీనియర్ ఐఎస్ అధికారులు జయలక్ష్మి, సురేశ్ కుమార్, ప్రశాంతి, హరి జవహర్ లాల్.. రీసర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల ఏర్పాటు, జలధార గురించి పలు సూచనలు చేశారు.జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ, రెవెన్యూ, సర్వే, డ్వామా, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.


# అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా మారుస్తాం









**ఒకటి తరువాయి**

సుమంత్ సిన్హా ఈ సోలార్ వేఫర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాన్ని ఎంచుకుని వ్యాపారం మొదలు పెట్టారు... ఇప్పుడు పెట్టుబడులు పెట్టడానికి ఏపీని ఎంచుకున్నారు. రెన్యూ ఎనర్జీ కేంద్ర కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆ సంస్థను కోరుతున్నాను. రెన్యూ ఎనర్జీనే కాదు... జాతీయ అంతర్జాతీయ సంస్థలను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెడితే సురక్షితంగా ఉంటాయి. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నా. గడచిన 22 నెలల్లో 802 ఎంఓయూలు చేసుకున్నాం. వాటిపై నిరంతరం సంప్రదింపులు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అనుమతులు ఇస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ద్వారా సుపరిపాలన అందిస్తున్నాం. 2019–24 మధ్య పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు భయపడ్డారు. వేధింపులు, అవినీతి పెద్ద ఎత్తున జరిగింది. 2024లో మీరు వేసిన ఒక్క ఓటుతో ప్రజల్లో అభద్రత, ఆందోళనను తొలగించాం. ఎన్డీఏ బ్రాండ్‌తో ఏపీలో విశ్వాసం తిరిగి వచ్చింది. పరిశ్రమలకు, పెట్టుబడులకు భరోసా వచ్చింది. పారిశ్రామిక వేత్తలకు సహకరిస్తూ భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉత్తరాంధ్రలో ప్రతి రోజూ పెట్టుబడుల పండుగ. ఈ నెల 28 తేదీన 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. జూలైలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోంది. లారస్ ల్యాబ్ రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోంది. ప్రధాని మోదీ సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. రైల్వే జోన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాం. విశాఖ–రాజమహేంద్రవరం మధ్య కార్గో కోసం నాలుగు రైల్వేలైన్ల స్పీడ్ రైల్ కారిడార్ వస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇతర రాష్ట్రాల నుంచే ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే పరిస్థితి తెస్తాం. ఈ రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌తో నన్ను విశ్వసించిన యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి.”అని ముఖ్యమంత్రి చెప్పారు. “అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం కూడా ఓ భాగం. ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత అభివృద్ధి సాధించినట్టే. అందుకే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. గత పాలకులు విధ్వంసం చేసిన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మాణం చేయాలన్న లక్ష్యంతోనే కూటమి ప్రజా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెన్యూ ఎనర్జీ వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. రాంబిల్లిలో సౌర ఫలకాలు తయారవుతాయి. విద్యుత్ సంస్కరణల్ని ప్రారంభించింది మేమే. ఆ ఫలితాలు అందరికీ అందుతున్నాయి. ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 90 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా పనులు గ్రౌండ్ అయ్యాయి. రూ.5.95 లక్షల కోట్లు ఈ రంగంలో పెట్టుబడులు వచ్చాయి., ఎంఓయూలు సిద్ధమైపోయాయి. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోంది. గ్రీన్ ఈవీ వాహనాలు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాం. ఆర్టీసీ కూడా 1,050 బస్సులు తీసుకువస్తోంది. భవిష్యత్తులో ఆర్టీసీ బస్సులన్నీ ఈవీ బస్సులే. పేదలకు కూడా ఆర్టీసీ బస్సుల్లో తిరిగే సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తాం. రాష్ట్రంలో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతీ ఇంటిపైనా విద్యుత్ ఉత్పత్తి కోసం పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలి. 40 లక్షల ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అటు రైతులు కూడా పీఎం కుసుమ్ కింద సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్ అక్కడే వాడుకునే పరిస్థితి ఉంటే ట్రాన్స్ మిషన్ నష్టాలు కూడా ఉండవు. రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి అంటే... జాతి నిర్మాణమే. అలాంటి మంచి కార్యక్రమానికి సహకరిస్తున్న రెన్యూ సంస్థను అభినందిస్తున్నాను. ప్రస్తుతం యుద్ధం జరుగుతోంటే.గ్యాస్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దేశీయంగానే విద్యుత్ ఉత్పత్తి సహా ఇతర అంశాల్లో మనం ముందంజలో ఉంటే. అంతర్జాతీయంగా వచ్చే ఇబ్బందులను తట్టుకునే పరిస్థితి ఉ ంటుంది. అందుకే ప్రధాని మోదీ రెన్యూవబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారు.”అని సీఎం చంద్రబాబు చెప్పారు.

### గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తున్నాం.

“పేదల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజలకు సుపరిపాలన అందేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ రంగం సహా వివిధ వ్యవస్థల్లో గత ప్రభుత్వ తప్పిదాలు సరి చేస్తున్నాం. 2019–24లో పీపీఏలు రద్దు చేసి, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేశారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనం కట్టాల్సి వచ్చింది. ప్రజలపై రూ. 32 వేల కోట్ల భారాన్ని గత పాలకులు వేశారు. ట్రూ అప్ ఛార్జీలు పేరుతో భారీగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు. గత పాలకులు వేసిన ట్రూ అప్ ఛార్జీలను... మేం చరిత్రలో తొలిసారిగా ట్రూ డౌన్ అమలు చేశాం. దీంతో పాటు ట్రూ అప్ భారాన్ని కూడా ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరిస్తోంది. రూ.15,795 కోట్లు ఛార్జీల భారం పెంచకుండా ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే నిలబెట్టుకుంటున్నాం. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాం... విద్యుత్ ఛార్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచం. గత పాలకులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చారు. వాటిని రీషెడ్యూలు చేస్తున్నాం. అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నాం. రాజధాని అమరావతి నిర్మాణంతో రాష్ట్ర దశాదిశ మారుతుంది. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ సహా 9 జిల్లాలు, అమరావతి కేంద్రంగా పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకూ, తిరుపతి కేంద్రంగా రాయలసీమ అంతటా వివిధ రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రతో హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యం”అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### హత్యలు చేస్తారు... సాక్షుల్ని బెదిరిస్తారు.

“మంచి కార్యక్రమాలు... శుభ దినాల్లో కూడా తప్పుడు పనులు చేసే వారిని.దుర్మార్గులను గుర్తు చేసుకోవాలి. అలాంటి వారి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి కాబట్టి. చెప్పాల్సి వస్తోంది. నేరాలు ఘోరాలు చేసే ఓ పార్టీ రాష్ట్రంలో అరాచకాలు చేస్తోంది. వివేకా హత్య తరహాలోనే కడపలో దస్తగిరి అనే వ్యక్తిని హత్య చేశారు. జగన్ మోహన్ రెడ్డి మేనమామకు ప్రధాన అనుచరుడు ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని చంపేశారు. డబ్బు కోసం, ఆస్తుల కోసం సొంత మనుషుల్ని సైతం కడతేర్చే కిల్లర్ పార్టీ అది. ఇలాంటి మోసగాళ్లపై నిరంతరం కన్నేసే ఉంచుతున్నాం. ప్రస్తుతం నేరస్థులతో రాజకీయం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఎమ్మెల్సీగా చేశారు. ఇప్పుడు మళ్లీ అతనే సాక్షుల్ని బెదిరించే స్థాయికి చేరాడు. అలాంటి రాజకీయ పార్టీ ఐడియాలజీని ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇలాంటి పార్టీలు సమాజానికి దూరం కావాలి. అధికారంలోకి వస్తే నరికేస్తాం, చంపేస్తాం, పెట్టుబడి దారులను తరిమేస్తాం అని బెదిరించే పార్టీలు మనకెందుకు? అయినా వాళ్ల బెదిరింపులకు కాలం చెల్లింది. ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలు చేసి అభద్రతా భావం సృష్టించే వాళ్లు రాజకీయాల్లో అవసరమా? రాష్ట్రంలో మంచి జరుగుతోంటే. కిల్లర్ పార్టీకి ఫ్రస్టేషన్ పెరిగిపోతోంది. నాడు ఉత్తరాంధ్రలో ప్రొక్లయినర్ తో కూల్చివేతలు జరిగేవి. నేడు అవే ప్రొక్లయినర్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. నాడు ఉత్తరాంధ్ర ప్రాంతంలో భూములను కబ్జాలు చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారు. కానీ నేడు అవే భూముల్లో ప్రపంచ స్థాయి కంపెనీలు వస్తున్నాయి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రకృతి వనరులు దోచిన పాలకులకు. ప్రకృతి వనరులను సంపదగా మార్చే ప్రభుత్వాలకు మధ్యనున్న తేడాను ప్రజలంతా గమనించాలి.”అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా, జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు సూచిక బోర్డులు ఏర్పాటు : సబ్ ఇన్స్పెక్టర్ సురేష్







**డుంబ్రిగుడ, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రమాదాల నియంత్రణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో భాగంగా మండలంలోని పాడేరు అరకు జాతీయ ప్రధాన రహదారి ప్రమాద సంఘటన కూడలిలో సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు మండల సబ్ ఇన్స్పెక్టర్ ఎల్ సురేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. వాహన చోదకులు అతివేగం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాల కారణంగా పలువురు మృత్యువాత చందగా మరి కొంతమంది తీవ్ర గాయాలు పాలైన సందర్భాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలను నియంత్రించేందుకు గాను అల్లూరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ప్రమాద కోడల్లో అతివేగం వద్దు.. నిదానమే ముద్దు మెల్లగా వెళ్ళుము అనే నినాదాన్ని సూచిస్తూ సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ 516 నేషనల్ హైవే రోడ్డులోని ఏర్పాటుచేసిన సూచిక బోర్డులు మండలంలోని బిల్లాపుట్టు, ఆంత్రిగూడ, నారింజ వలస మలుపుల వద్ద ఏర్పాటు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అదేవిధంగా వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా తూచా తప్పకుండా ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో మహర్షి భగీరథ జయంతి వేడుకలు

### పూలమాలలు వేసి నివాళులర్పించిన ఇన్చార్జి డీఆర్వో గోవిందు, బీసీ వెల్ఫేర్ అధికారిణి రాజేశ్వరి



**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ):** మహర్షి భగీరథ జయంతి వేడుకలు విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ చిత్రపటానికి ఇంచార్జి డీఆర్వో టి. గోవిందు, బీసీ వెల్ఫేర్ అధికారిణి రాజేశ్వరి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహర్షి భగీరథ మహోన్నత సేవలను వారంతా స్మరించుకున్నారు. ఆయన చూపిన అచంచల సంకల్పం, కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజాభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేయాలని ఆయన జీవితం స్ఫూర్తినిస్తుందని తెలిపారు. మహర్షి భగీరథ స్ఫూర్తితో సమాజ సేవలో ముందుండాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ హామీల అమలు చేయాలని సీఎంకు గంటా వినతి



**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం భూములిచ్చిన రైతుల పెండింగ్ హామీల అమలుకు అధికారులకు సోచబలివ్వాలని సీఎం చంద్రబాబు నాయుడును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ శంకుస్థాపన కోసం గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలానికి వచ్చిన సీఎంను హెలిప్యాడ్ వద్ద గంటా స్వాగతం పలికారు. గూగుల్ డేటా సెంటర్ కు ఈనెల 28 న శంకుస్థాపన గురించి మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియకు పూర్తి సహకారాన్ని అందించిన రైతుల డి.పట్టా భూములకు రిజిస్ట్రార్ మార్కెట్ విలువ కంటే ఎక్కువగా ఎకరానికి రూ.20 లక్షలకు పెంచడం పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. భూములిచ్చిన రైతులకు.. ముందుగా చెప్పిన విధంగా పరిహారాన్ని అందజేయడం జరిగిందని గంటా చెప్పారు. రెండున్నర రెట్ల పరిహారంగా రూ.50 లక్షలు ప్రకటించినప్పటికీ, కొంత భూమి కావాలని రైతులు కోరారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గతంలో చెప్పగా ఎకరానికి 20 సెంట్ల చొప్పున భూమికి నగదు కాకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని ఇవ్వాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. దాంతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం.. ఉపాధి నిమిత్తం షాపింగ్ కాంప్లెక్స్ లో షాపు.. ప్రకటించారన్నారు. అలాగే సి.ఎల్.డి.పి. కింద 520 మంది రైతులకు 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పినందున దాని అమలు అంశాన్ని పరిశీలించి స్పష్టమైన ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళల భద్రతపై అరమ, నడిమి వలస గ్రామాల్లో పోలీస్ శాఖ అవగాహన

### మహిళల హక్కులను గౌరవించండి - సమానత్వాన్ని పొందండి :ఎస్ఐ సురేష్



**డుంబ్రిగుడ, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ):** పలు సందర్భాల్లో మహిళలపై జరుగుతున్న సామూహిక అత్యాచారాలకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇక్కడి పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అరమ పంచాయతీ అరమ, నడిమివలస గ్రామాలల్లో గురువారం మండల సబ్ ఇన్స్పెక్టర్ ఎల్ సురేష్ సిబ్బందితో ఆయా గ్రామాలను సందర్శించి గిరిజన మహిళలు గిరిజనులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులను గౌరవించండి – సమానత్వాన్ని పొందండి అని అన్నారు. అలాగే గృహ హింసను వ్యతిరేకించాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై మహిళలపై ఎటువంటి అఘాయిత్యాలు అత్యాచారాలు వంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అదేవిధంగా యువత వాహనాలు నడిపేటప్పుడు వేగాన్ని దృష్టిలో పెట్టకుండా నిదానమైన ప్రయాణాన్ని సాగించి తమ తమ గమ్యలతో పాటు అవసర ప్రాంతాలకు చేరుకోవలన్నారు. మహిళలపై జరిగిన నేరాల్లో నిందితులకు ఎటువంటి చట్టరీత్యా శిక్షలు ఏ విధంగా ఉంటాయన్నది వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఆయా గ్రామాల గిరిజనులు మహిళలు పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులకు తగిన సౌకర్యాలు కల్పించాలి

### - హజ్ యాత్రికుల లగేజ్ వారికి అందక ఇబ్బందులు : మాజీ హజ్ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్



**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ):** గన్నవరం ఎంబరికేషన్ పాయింట్ నుండి ఈ నెల 18,19 తేదీలలో 333 మంది ప్రయాణికులతో నేరుగా మదీనా చేరుకున్న విషయం తెలిసినదే నని,కానీ ఇప్పటి వరకు హజ్ యాత్రికుల లగేజ్ వారికి అందక పోవడం విచారకరం అని మాజీ హజ్ డైరెక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశారు.

అసలు కారణం,ఇస్లాం పద్ధతి ప్రకారం ఎహెరామ్ కట్టుకొని ప్రయాణం కొనసాగిస్తారో అదే వస్త్రాలతో గత 3,4 రోజులు నుండి గడుపుతూ వారి లగేజ్ ఎప్పుడు తమకు అందుతుందని,చూస్తున్నారని ఇలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు ఆల్ డిపార్ట్మెంట్ మీటింగ్ జరుగుతుందన్నారు.అందులో ప్రధానంగా ఎంబరికేషన్ అధికారులు హజ్ యాత్రికులు ప్రయాణం చేసే విమానానికి సంబంధించిన సిబ్బంది ఈ మీటింగ్ లో పాల్గొంటారన్నారు.తద్వారా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్య లు తీసుకుంటారని,అలాగే విమానాలు టేక్ ఆఫ్ అయ్యిన తర్వాత హజ్ కమిటీ చైర్మన్ మరియు ఈ ఓ ,హజ్ కమిటీ హాజీలు గమ్యస్థానాని కి చేరేవరకు పర్యవేక్షిస్తారని కానీ ఈ రోజు ఈ పరిస్థితి రావడానికి ప్రధాన కారణం తమకున్న సమాచారం ప్రకారం ఇప్పటికే మదీనాలో ఉన్న హజ్ యాత్రికుల్లో చాలా మంది షుగర్ మరియు ఇతర అనారోగ్య సమస్యలున్నవారే నని,లగేజ్లో తమ మందులు ఉండి పోవడం వల్ల భయాందోళనకు గురి అయ్యి సమయానికి మందులు వాడక ఇబ్బంది కలిగి ఇండియాలో ఉన్న తమ బంధువులకు విషయం తెలియచేయగా,ఈ విషయం వెలుగులో కి వచ్చిందని మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు.

ఇప్పటికైనా కేంద్ర హజ్ కమిటీ,రాష్ట్ర కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టి మదీనాలో ఉన్న హాజీలకు వైద్య సేవలు అందించాలని వెంటనే వారి లగేజ్ వారి కి అందించే విధంగా చర్యలు చేపట్టాలని మాజీ హజ్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు.

## అంగన్వాడీ వేతనాలు పెంచాలని ఆందోళన

**పాలకొండ, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు వర్తింవజేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకూ అంగన్‌వాడీలు భారీగా ర్యాలీ అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమప్రభ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.అమరవేణి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీలను అమలు చేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రోజు రోజుకు అంగన్వాడీలపై పని భారం పెంచుతున్న ప్రభుత్వం జీతాలు పెంచేందుకు మాత్రం సిద్ధపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని, పెండింగ్ మినీ వర్కర్ అప్ గ్రేడ్ చేయాలన్నారు. హెల్పర్లకు ప్రమోషన్ జీవో 5 సవరించాలని, అంగన్వాడీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించారు డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి టి.సత్యవతి, జిల్లా నాయకులు సరోజ, బి.పార్వతి, ఎ.దరిశమ్మి, కె.కన్యాకుమారి, జి.శారద, ఎం.శ్యామల, శ్రీదేవి, వై.మణి, లలిత, జెస్సీబాబు, దివ్య, సునీత, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కాదా రాము, వివిధ సంఘాల నాయకులు ఎం.వీరంనాయుడు, వి.శారద పాల్గొన్నారు. కలెక్టరేట్ :అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ ధర్నాలో అంగన్వాడీలకు మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించాలనీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా చేసి అనంతరం ఎటకు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు వర్తింపజేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకూ అంగన్‌వాడీలు భారీగా ర్యాలీ అనంతరం అక్కడ ధర్నా చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు అంగన్వాడీ యూనియన్ నాయకులు వి రామలక్ష్మి, గౌరీ మణి, కె.దాలమ్మ, గౌరమ్మ మాట్లాడారు. ఐద్వా జిల్లా కార్యదర్శి బి లక్ష్మి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరి ఎస్ అనురాధ సత్యవతి సావిత్రి నిర్మల అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ఇచ్చిన హామీ అమలు చేయాలి



**సీతానగరం , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఉపాధి కూలీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని చిన్న భోగిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ గత మూడు నెలల్లో సుమారు 22 లక్షల కుటుంబాలు ఉపాధి హామీలో పని చేస్తే నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1028 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయి సమస్యతో పాటు పని ప్రదేశంలో ముఖ హాజరు పనిచేయకపోవడం వల్ల లక్షలాది కుటుంబాలు పని ప్రదేశం నుంచి ఇంటికి తిరిగి వెళ్లిపోతున్నారని, చట్టానికి విరుద్ధంగా రెండు పూటలా పనిచేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ డైరెక్టర్ స్వయాన వచ్చి వేతన బకాయిల చెల్లిస్తామని, రెండు పూటల పని పెట్టబోమని, ఎక్కడైనా అధికారులు ఒత్తిడి చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. వీటితో పాటు ఫేను యాప్ పనిచేయలేదనిపనిప్రదేశం నుంచి ఇంటికి తిరిగి పంపించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల ఇచ్చిన హామీని నిలుబెట్టుకోకపోతే, మే ఒకటో తేదీన పని ప్రదేశాల్లో పెద్ద ఎత్తున నిరసనకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చ హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు. ఫేషియల్ యాప్ రద్దు చేయాలని ఉపాధి కార్మికుల వినతికురుపాం : మండలానికి చెందిన ఉపాధి హామీ కార్మికులు కొండగొర్రి జయప్రకాష్, బిడ్డిక భాస్కరరావు, కొండగొర్రి చిన్నారావు, బిడ్డిక లింగరాజు, అరిక తికన్న, బిడ్డక సూర్యం ఫేషియల్ రికగ్నిషన్ యాప్ వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మేరకు గురువారం మండల ప్రత్యేక అధికారి ఎస్. దిలీప్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. నెట్వర్క్ సమస్యలు, వృద్ధులకు ఫేషియల్ గుర్తింపు లోపాలు, హాజరు నమోదు కాక వేతనాలు అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. కావున ఫేషియల్ యాప్ విధానాన్ని రద్దు చేసి, పాత మస్తర్ రోల్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని, వేతనాలు సమయానికి కల్పించాలని కార్మికులు కోరారు.

# రెండో రోజు కొనసాగిన దీక్ష



**సాలూరు , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మండలం ఖరాసువలస కెజిబివి ప్రిన్సిపాల్‌తో సహా ఇతర సిబ్బంది తొలగింపు ఉత్తర్వులు తక్షణమే ఉపసం హరించు కోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు రెండో రోజున గురువారం కొనసా గాయి.కాంగ్రెస్, సిపిఐ, గిరిజన నిరుద్యోగ సంఘం, ఐఎఫ్‌టియు నాయకులు మద్దతు తెలిపి ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్వతీపురం నియోజకవర్గం ఇన్చార్జి బత్తిన మోహనరావు మాట్లాడుతూ మహిళా చిరుద్యోగుల పట్ల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కక్ష సాధింపు చర్యలకు దిగడం సరైంది కాదన్నారు. మంత్రి తీరుపై పోరాటం చేస్తామని తెలిపారు. తక్షణమే తొలగించిన కరాసువలస కెజిబివి సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్వీ ఎస్ కుమార్ మాట్లాడుతూ మంత్రి, అధికారులు కలిసి చిరుద్యోగుల కుటుంబాలను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. గిరిజన నిరుద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు రఘుపతుల శశి భూషన్, ఐఎఫ్‌టియు నాయకులు గరుగుబిల్లి రాజు, కాంగ్రెస్ నాయకులు తీల్ల గౌరీశంకర్ రావు, చొక్కాపు వెంకట రమణ, పట్లాసింగు రవి కుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు మర్రాపు ధనుంజరు, బాధిత మహిళలు పాల్గొన్నారు.ఉపాధ్యాయ సంఘాలు మౌనం వీడాలిఅన్యాయంగా సాలూరు మండలం ఖరాసువలస కెజిబివి ప్రిన్సిపాల్‌తో సహా ఇతర సిబ్బంది సస్పెన్షన్, టెర్మినేషన్ జరిగి ఎనిమిది నెలలైనా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు దీక్ష శిబిరంలో గురువారం రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేయండని కెజిబివి పాఠశాలలో ప్రచారం చేసే ఉపాధ్యాయ సంఘాలు ప్రిన్సిపాల్‌తో సహా ఇతర సిబ్బంది తొలగింపు ఉత్తర్వులు ఇస్తే మౌనం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు సైతం మౌనం వీడాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బాధిత ప్రిన్సిపాల్ ఎమ్మెల్సీకి వినతి పత్రం కూడా ఇచ్చారని గుర్తు చేశారు. తొలగించిన కెజిబివి ఉద్యోగులను విధుల్లోకి తీసుకొనే వరకు వివిధ రూపాల్లో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# ఆదర్శవంతమైన గ్రామంగా కురసింగి



**సీతంపేట , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మండలంలోని కురసింగి గ్రామం ముస్తాబు చేసుకొని ఒక ఆదర్శవంతమైన గ్రామంగా నిలిచిందని కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి కొనియాడారు. గ్రామాల రూపురేఖలను మార్చి, వాటిని ప్రతీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'గ్రామ ముస్తాబు' కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. గురువారం కురసంగిలో ఏర్పాటు చేసిన 'గ్రామ ముస్తాబు' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డోలి రహిత జిల్లాగా మన్యంను తీర్చిదిద్దుతున్నామని, అందులో భాగంగా మారుమూల గిరిజన గ్రామమైన కురసింగికి బీటీ రోడ్డును నిర్మించుకోవడం గర్వకారణమని అన్నారు. అలాగే విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించి మొదలుపెట్టిన ముస్తాబు, నేడు ఫ్యామిలీ ముస్తాబు, గ్రామ ముస్తాబు కావడం ఆనందదాయకమన్నారు. ఈ గ్రామాన్ని ముస్తాబు చేసి అద్భుతమైన, సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన గ్రామస్తులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఈ నియోజకవర్గంపై చొరవ చూపుతూ, రోడ్ల నిర్మాణాలు చేయిస్తున్నారని గుర్తుచేశారు. సూర్యమండలం పేరుతో విభిన్న కాయగూరల పంటలను వేసుకొని పండించుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాల్గొని కార్యక్రమ విశిష్టతను వివరించారు. గర్భిణీలకు సీమంతాలు చేపట్టారు. ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలు, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. కురసంగిలో చేపట్టిన ఈ పనులు మిగిలిన గ్రామాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# రాష్ట్ర స్థాయిలో జీవీఎంసీకి ప్రతిష్టాత్మక అవార్డు..ఆస్తి పన్ను వసూళ్లలో విశాఖ అగ్రగామి నిలిచింది

## - జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లలో రికార్డు స్థాయిలో ప్రగతి సాధించినందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కు రాష్ట్ర స్థాయి లో ప్రతిష్టాత్మక అవార్డు, ప్రశంసా పత్రం లభించిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌హో తెలియజేశారు.గురువారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్--2026 పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి కమిషనర్ల వర్క్‌షాప్ సందర్భంగా, 2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను వసూళ్లలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు జీవీఎంసీ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ . సురేష్ కుమార్ , కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి .సంపత్ కుమార్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన రాష్ట్రస్థాయి అవార్డునుహో , ప్రశంసా పత్రాన్ని జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావు తో కలిసి తను స్వీకరించడమైనదని కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ వివరిస్తూ రాష్ట్ర స్థాయిలో జీవీఎంసీకి ప్రతిష్టాత్మక అవార్డు, ఆస్తి పన్ను చెల్లింపులలో విశాఖ అగ్రగామి నిలిచిందని, ఈ ఘనత విశాఖ నగర అభివృద్ధి దిశగా ఆస్తి పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు ,నగర ప్రజల సహకారంతోనే ఈ అవార్డు జీవీఎంసీ కి లభించిందని , ఈ అవార్డును సాధించినందుకు గాను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖప్రధాన కార్యదర్శి ఎస్ . సురేష్ కుమార్,కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్ జీవీఎంసీని అభినందిస్తూ 2026- 27 లో కూడా విశాఖ నగర అభివృద్ధి దిశగా ఆస్తి పన్ను వసూళ్లను, కొత్తగా ఆస్తి పన్ను విధింపులలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టికి ,రాష్ట్ర అభివృద్ధికి మరింత ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారు పేర్కొన్నారని కమిషనర్ తెలిపారు.2025--26 ఆర్థిక సంవత్సరంలో జీవీఎంసీ ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధించిందని, సుమారు ?90 కోట్ల పెరుగుదల లక్ష్యంగా తీసుకుని, అందులో ?60 కోట్లు అదనంగా వసూలు చేయడం జరిగిందని,గత ఆర్థిక సంవత్సరంలో ?510 కోట్ల వసూళ్లు నమోదు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 110 కోట్ల వృద్ధితో మొత్తం వసూళ్లు పెరిగి 21.5% వృద్ధి రేటు నమోదు కావడం విశేషనన్నారు.ఈ అవార్డు సాధనకు జీవీఎంసీ అదన కమిషనర్ డివి రమణమూర్తి కార్యాచరణలో జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్ శ్రీనివాసరావు నిరంతర పర్యవేక్షణలో రెవెన్యూ విభాగం, ఫీల్డ్ సిబ్బంది ,పన్ను చెల్లింపుదారుల సమిష్టి కృషి ఫలితమని పేర్కొన్నారు. నగర అభివృద్ధికి ఆస్తి పన్ను వసూళ్లు కీలకమని, భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన చర్యలతో వసూళ్లను పెంచేందుకు కృషి చేస్తామని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లలో జీవీఎంసీ అగ్రగామిగా నిలవడం పట్ల అధికారులు సంతోషం వ్యక్తం చేశారని, ఈ సందర్భంగా విశాఖ నగర పరిధిలో గల ఆస్తిపన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు, నగర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలను కమిషనర్ తెలిపారు.

# ఒడిశా ఖాకీల జులుం



**సాలూరు , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** వివాదాస్పద కొటియా సరిహద్దు గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం మరోసారి తన అహంకారాన్ని ప్రదర్శించింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, పోలీసు బలగాలతో గిరిజనలపై విరుచుకుపడుతూ బలవంతపు జనగణన చేపడుతోంది. ఒడిశా పోలీసుల ఈ దౌర్జన్యకాండను సిపిఎం సాలూరు మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎగువ సెంబిలో గురువారం ఒడిశా అధికారులు భారీగా మోహరించి పోలీసుల అండతో గిరిజనుల ఇళ్లపైకి వెళ్లారు. స్థానిక గిరిజనులు తమకు ఈ గణనతో సంబంధం లేదని, తాము ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారమని వ్యతిరేకించినప్ప టికీ, అధికారులు వెనక్కి తగ్గలేదు. గిరిజనులను భయాందోళనలకు గురిచేస్తూ బలవంతంగా వివరాలు సేకరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొటియా గిరిజనులు నిత్యం భయం నీడలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా అక్రమాలను అరికట్టాలని అనేకమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక మంత్రి సంధ్యారాణికి విన్నవించినా ఫలితం లేదన్నారు. గిరిజనుల రక్షణ విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. ఒడిశా ప్రభుత్వం వెంటనే కొటియా గ్రామాల్లో తన దౌర్జన్యాలను ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి తక్షణమే జోక్యం చేసుకుని గిరిజనులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సరిహద్దు వివాదంపై శాశ్వత పరిష్కారం చూపి, గిరిజనుల మనోభావాలను గౌరవించాలని, గిరిజనుల హక్కుల కోసం, వారి ఆత్మగౌరవం కోసం సిపిఎం ఎల్లప్పుడూ పోరాడుతుందని, ఒడిశా ప్రభుత్వ మొండి వైఖరిని సహించేదిలేదని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు.

# ఘనంగా ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన పోలీసు ఉన్నతాధికారులు





**అనకాపల్లి (రాంబిల్లి), ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** రాంబిల్లి మండలం, గజిరెడ్డిపాలెం గ్రామంలో ఏర్పాటు చేయనున్న 'రెన్యూ ఫొటోవోల్టాయిక్స్' ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చిన ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి కి జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ తరపున సాదర స్వాగతం లభించింది. విశాఖ రేంజ్ ఐజి గోపినాథ్ జట్టి, మరియు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో పాటు ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

# విశాఖ సిటీలో పోలీస్ అధికారుల బదిలీ

### - ఇద్దరు సిఐ ల పై బదిలీ వేటు : సిపి సీరియస్

**విశాఖ, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ మార్పులు చేపట్టినట్లు అధికారికంగా ప్రకటించారు. బదిలీల వివరాలు (ఉత్తర్వు సంఖ్య: 368/2026): కమిషనర్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం బదిలీ అయిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. ఏ. పార్థసారధి ప్రస్తుతం గాజువాక శాంతి భద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఈయనను, నగర ఖాళీ నిరీక్షణ విభాగానికి బదిలీ చేశారు. ఏ. దాశరధి ప్రస్తుతం నగర నిరీక్షణ విభాగంలో ఉన్న ఈయనను, విశాఖపట్నం పరిధికి అప్పగిస్తూ (సరెండర్) నిర్ణయం తీసుకున్నారు. గాజువాక శాంతి భద్రతల పోలీస్ స్టేషన్ బాధ్యతల నుండి పార్థసారధిని బదిలీ చేయడంతో, ఆ స్థానంలో దువ్వాడ శాంతి భద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన గాజువాక స్టేషన్ బాధ్యతలను కూడా పర్యవేక్షించాల్సి ఉంటుంది. బదిలీ అయిన అధికారులను వెంటనే విధుల్లోంచి విడిచిపెట్టాలని (రిలీవ్), వారు తమ కొత్త విధుల్లో చేరిన తేదీని కార్యాలయానికి నివేదించాలని నగర కమిషనర్ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు తో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## తుప్పు వల్ల జీడీపీ లో 3-5% వరకు నష్టం జరుగుతోంది

**- నిపుణులు జింక్ ఆధారిత నివారణపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు**

**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రపంచ తుప్పు అవగాహన దినోత్సవం సందర్భంగా, నిపుణులు తుప్పు వల్ల కలిగే ఆర్థిక మరియు భద్రతా సమస్యలను ప్రస్తావించారు. తుప్పు కారణంగా ప్రపంచ +జూలో 3--5% వరకు నష్టం జరుగుతుందని, ఇది మౌలిక వసతుల సామర్థ్యాన్ని తగ్గించే అంశమని, ఇటీవలివరకు పెద్దగా గమనించబడలేదని వారు పేర్కొన్నారు. భారతదేశంలో మౌలిక వసతులు అధిక ఆర్ద్రత, తీరప్రాంత వాతావరణం మరియు పారిశ్రామిక కాలుష్యానికి గురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తుప్పు వేగంగా పెరిగి రవాణా, నిర్మాణం, శక్తి వంటి రంగాల్లో ఉక్కు ఆస్తుల క్షీణతను వేగవంతం చేస్తుంది. ఇది కేవలం రూపకల్పన సమస్య కాదు తుప్పు నిర్మాణ బలాన్ని తగ్గిస్తుంది, ఆస్తుల జీవితకాలాన్ని తగ్గిస్తుంది, తరచుగా మరమ్మతులు అవసరమవుతాయి మరియు ముందుగానే మార్పిడి చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది ప్రజా వనరులు మరియు కార్యకలాపాల ఉత్పాదకతపై నేరుగా ప్రభావం చూపుతుంది. తరచుగా జరిగే మరమ్మతులు, విఫలతలు మరియు ముందస్తు ఆస్తి మార్పిడి జీవనచక్ర ఖర్చులను పెంచడమే కాకుండా, కీలక మౌలిక వసతుల వ్యవస్థల ఉత్పాదకతను కూడా తగ్గిస్తాయి. నిపుణుల మాటల్లో, ఈ నష్టాల్లో చాలా వరకు నివారించవచ్చు డిజైన్ అమలు చేసే ముందు దీర్ఘకాలికతను ప్రాధాన్యం ఇచ్చే నివారణ చర్యల ద్వారా, ప్రతిస్పందనాత్మక మరమ్మతుల కంటే. "భారతదేశం తుప్పు కారణంగా ప్రతి సంవత్సరం +జూలో 3--5% నష్టపోతుంది. ఇది కేవలం మరమ్మతుల సమస్య కాదు, ఇది జీవనచక్రం మరియు ఆర్థిక సామర్థ్య సమస్య," అని ఇంటర్నేషనల్ జింక్ అసోసియేషన్ ఇండియా డైరెక్టర్ డా. రాహుల్ శర్మ అన్నారు. "తుప్పు కారణంగా అనేక సందర్భాల్లో ఆస్తులను ఉద్దేశించిన దానికంటే చాలా ముందుగానే మార్చాల్సి వస్తుంది. జింక్ ఆధారిత రక్షణ ఉక్కు జీవితాన్ని 3 నుండి 5 రెట్లు పెంచే ప్రయోజనాన్ని అందిస్తుంది, జీవనచక్ర ఖర్చులను తగ్గిస్తుంది, భద్రత మరియు విశ్వసనీయతను పెంచు తుంది." జింక్ ఉక్కును రక్షించడంలో గాల్వనైజేషన్ మరియు ఇతర పూతల ద్వారా కీలక పాత్ర పోషిస్తుంది. త్యాగ లోహంగా పనిచేసే జింక్, ఉక్కు కంటే ముందుగా తుప్పు పట్టి, కఠిన వాతా వరణ పరిస్థితుల్లో కూడా నిర్మాణ నష్టాన్ని తగ్గిస్తుంది.

## తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ హీట్..!!..పోలీసుల అదుపులో సిపిఎం నాయకులు



**ఆనందపురం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ నేపథ్యంలో రైతులను పరామర్శించేందుకు వెళ్లిన సిపిఎం నాయకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన సుమారు 520 మంది రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తర్లువాడ గ్రామంలో పోలీసులు భారీగా మోహరించి, గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని సమాచారం.రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలతో సిపిఎం బృందం గ్రామాన్ని సందర్శించగా, పోలీసులు వారిని గ్రామంలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. రైతులతో ఎటువంటి సమావేశం నిర్వహించనీయకుండా సిపిఎం నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకుని, జీపుల్లో ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అదుపులోకి తీసుకున్న వారిలో 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. మూర్తి తదితరులు ఉన్నారు. సుమారు వందమంది పోలీసులతో సిపిఎం బృందాన్ని చుట్టుముట్టి, గూగుల్ డేటా సెంటర్ ప్రాంతం వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా గంగారావు, ఆర్.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ, రైతులతో మాట్లాడే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. బలవంతపు అరెస్టులు చేయడం తగదని పేర్కొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవం




**తగరపువలస , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తగరపువలస నందు "అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవం" నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. పి.శ్రీవాణి మాట్లాడుతూ ఆంగ్లభాష ప్రాముఖ్యతను వివరిస్తూ అందరికీ అర్థమయ్యేలా మరియు ప్రపంచ దేశాలతో అనుసంధాన పరచడానికి ఒక మధ్యేమార్గంగా ఉందని, ప్రస్తుతం ఉన్న యువత ఇంగ్లీష్ బాష పై పట్టు సాధించి మరీయు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఇంగ్లీష్ లెక్చరర్ సి.హెచ్. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష యొక్క ఆవిర్భావం గురించి విపులంగా వివరిస్తూ ప్రస్తుతం ఉన్నటువంటి కాలంలోనే ఇంగ్లీష్ యొక్క ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. అలాగే ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఇంగ్లీష్ భాష యొక్క విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇల్లు కూలి గిరిజనుడు మృతి గ్రామాన్ని కలచివేసిన విషాదం

**- కేసు నమోదు చేసిన ఎస్ఐ యాసిన్**



**గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మండలంలో దుప్పుల వాడ పంచాయతీలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. సుమారు 30 ఏళ్లుగా అదే ఇంట్లో నివసిస్తూ జీవనం సాగిస్తున్న గిరిజన వృద్ధుడు వంతల చిన్నయ్య (65) తన సొంత ఇల్లు కూలిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. సీలేరు ఎస్ఐ యాసిన్ తెలిపిన వివరాల ప్రకారం, చిన్నయ్య దాదాపు పదేళ్ల క్రితం భార్యను కోల్పోయి అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్నాడు. గ్రామస్తులు ఇచ్చే సరుకులతో జీవనం సాగిస్తూ తన పాడుబడిన ఇంట్లో నివసిస్తు న్నాడు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన గాలి, వర్షం కారణంగా అతను నిద్రిస్తున్న సమయంలో ఇల్లు ఒక్కసారిగా కూలిపోయి అతని మీద పడింది. బుధవారం ఉదయం గ్రామస్తులు గమనించి, ధైర్యం చేసి కూలిపోయిన పెంకులను తొలగించి చూడగా చిన్నయ్య మృతదేహం కనిపించింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. బంధువులు ఎవరూ లేకపోవడంతో గ్రామ వీఆర్ఓ ద్వారా ఫిర్యాదు స్వీకరించిన సీలేరు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ యాసిన్ తెలిపారు. ఈ ఘటన గ్రామస్తుల హృదయాలను కదిలించగా, పేద గిరిజనుల నివాస పరిస్థితులపై ఆలోచన కలిగించే దుర్ఘటనగా నిలిచింది.

## జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

**అరకులోయ , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సూచనల మేరకు, 24 ఏప్రిల్ 2026 న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయబడినవి. ఈ సందర్భంగా, ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిం చబడతాయి. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులు విస్తృతంగా పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన ముఖ్య అంశాలపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా "ఆత్మనిర్భర్ పంచాయతీ" లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు చేపట్టబడతాయి. ప్రజలలో అవగాహన పెంపు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గ్రామ సభల్లో మహిళా ఆధారిత అభివృద్ధి, పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పై ), స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (లాసడగ్స్ ), స్వంత ఆదాయ వనరుల (ఒసర్ ) పెంపు వంటి అంశాలపై చర్చలు



నిర్వహించబడతాయి. సమావేశాల షెడ్యూల్ నమోదు కోసం పంచాయతీ నిర్ణయ్ పోర్టల్, నివేదికల తయారీకి సభాసార్ యాప్ వినియోగం తప్పనిసరి చేయబడింది.

కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని అధికారులకు సూచించబడింది. గ్రామ స్థాయిలో పిడిఓ లు నోడల్ అధికారులుగా నియమించబడి, కార్యక్రమాల విజయవంతం నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఉదయం 10:30 కి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీసం ప్రసాద్ తెలియజేశారు.

## మహిళల భద్రతకు చట్టాలు వినియోగించాలి - ఎస్ఐ యాసిన్ పిలుపు



**గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మండలంలో దుప్పులవాడలో బుధవారం మహిళలు, యువత కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ యాసిన్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను ప్రతి మహిళ సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, చట్టపరమైన సహాయం అందుబాటులో ఉందని తెలియజేశారు. అలాగే రహదారి భద్రతపై అవగాహన పెంచుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమం మహిళలు, యువతలో భద్రతా చైతన్యాన్ని పెంపొందించడంలో సహాయపడగా, పాల్గొన్న వారు ఆసక్తిగా వినిపించి సూచనలను ఆచరణలో పెట్టాలని సంకల్పించారు.

## రామాలయ పునర్నిర్మాణానికి శంఖుస్థాపన



**ఆనందపురం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :**ఆనందపురం మండలం శోంఠ్యాం గ్రామంలో పురాతన శ్రీ రామాలయ పునర్నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా పాల్గొని పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక అభివృద్ధి సమాజ అభివృద్ధికి పునాది వంటిదని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం గొంతినవానిపాలెం గ్రామంలో శ్రీ దుర్గాలమ్మ నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆనందపురం మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు అదనపు విధులు తప్పించాలి



**మంచంగి పుట్టు , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు మినీ అంగన్వాడీ కార్యకర్తలకు అదనపు బాధ్యతలను విధించరాదని గురువారం నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రల అంగన్వాడి కార్యకర్తలకు మినీలు ఆయలతో సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లకు అంగన్వాడీల సమస్యలపై వినతి పత్రం అందజేస్తూ, సెన్సస్ డ్యూటీలు ఓ ,బి ఎల్ ఓ డ్యూటీలు రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్వాడి సిఐటియు యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరి, గంగా భవాని లు మాట్లాడుతూ అంగన్వాడీలకు అదనపు పనులు అప్పగించరాదని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ అంగన్వాడి లకు సెన్సెస్, బి ఎల్ ఓ డ్యూటీలు వేయడం దుర్మార్గపు చర్యగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిఎల్ఓ డ్యూటీలు చేయాలని ఒత్తిడి చేస్తూ అంగన్వాడీలకు మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారు అన్నారు. అంగన్వాడీలకు సెన్సెస్ డ్యూటీలు, పి ఎల్ ఓ డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేద గర్భిణీ బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్ డి కేంద్రాల్లో అనేక సేవలు అందిస్తున్నారు.

ల మాతృ, శిశు మరణాలు తగ్గించడానికి అంగన్వాడీలు కృషి చేస్తున్నారు. వేసుకుని నడపడంతో పాటు గర్భిణీ బాలితలకు కేక్ హోమ్ రేషన్ ఇస్తూ ఆరోగ్య సలహాలు గృహ సందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటి అనుబంధ సెక్టార్ల లీడర్లు,వి గంగాభవని,ఎస్ ఈశ్వరమ్మ, ఆర్ విజయ గంగాభవని, సిఐటియు మండల అధ్యక్షులు, పి బీమరాజు కార్యకర్తలు, మినీలు, ఆయాలు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో యువత జాగ్రత్త : స్థానిక ఎస్ఐ కీలక సూచనలు



**దేవరాపల్లి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** దేవరాపల్లి ఎస్సై వి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో యువత చెడు వ్యసనాలకు, ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని "సెలవులు అంటే స్వేచ్ఛ కాదు, బాధ్యత. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రూపులుగా చేరి రాత్రి వేళల్లో రోడ్లపై తిరగడం, బైక్ రేసింగ్‌లు, మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిస కావడం లాంటివి జీవితాన్ని నాశనం చేస్తాయి" అని హెచ్చరించారు. ఎస్ఐ యువతకు సూచనలు: బైక్ రేసింగ్ వద్దు: మైనర్లు వాహనాలు నడపొద్దు. హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తే కేసులు తప్పవు. చెరువులు, కాలువల్లో ఈత వద్దు: లోతు తెలియకుండా నీటిలోకి దిగితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది అని గుర్తుచేశారు. సోషల్ మీడియా జాగ్రత్త: తెలియని వ్యక్తులతో చాటింగ్, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి. మత్తు పదార్థాలు వద్దు: గంజాయి, గుట్కా, మద్యం అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అనుమానితులు కనిపిస్తే: కొత్త వ్యక్తులు, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. సమయం సద్వినియోగం: లైబ్రరీకి వెళ్లడం, క్రీడలు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. "మీకు ఏ సమస్య వచ్చినా పోలీస్ స్టేషన్‌కు రండి. మేము మీకు అండగా ఉంటాం" అని ఎస్ఐ భరోసా ఇచ్చారు.

## వేసవి సెలవులు షురూ..పిల్లలకు వడదెబ్బ తగలకుండా ఈ జాగ్రత్తలు తప్పనిసరి




**దేవరాపల్లి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో చిన్నారులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరుతున్న నేపథ్యంలో పిల్లలు వడదెబ్బ, డీహైడ్రేషన్ బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దేవరాపల్లి పి.హె.సి వైద్యాధికారి డా. పూజ్య మేఘన 'మనం న్యూస్'తో మాట్లాడుతూ, "ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలను ఎండలో ఆడుకోనివ్వవద్దు. లూజ్‌గా ఉండే కాటన్ దుస్తులు వేయించాలి. ప్రతి అరగంటకు ఒకసారి మంచినీళ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగించాలి" అని సలహా ఇచ్చారు. పిల్లలకు ముఖ్య సూచనలు: 1. ఎండలో వద్దు: మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు క్రికెట్, ఆటలు వద్దు. ఉదయం లేదా సాయంత్రం 5 తర్వాత ఆడుకోవాలి. 2. నీళ్లు మస్ట్: దాహం వేయకపోయినా నీళ్లు తాగాలి. బయటకు వెళ్తే వాటర్ బాటిల్ తప్పనిసరి. 3. తలకు టోపీ/గొడుగు: బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ, కళ్లకు కూలింగ్ గ్లాస్ పెట్టుకోవాలి. 4. ఆహారం: జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. పుచ్చకాయ, కర్బూజా, తాటి ముంజలు, మజ్జిగ ఇవ్వాలి. 5. వడదెబ్బ లక్షణాలు: విపరీతమైన చెమట, తలతిరగడం, వాంతులు అయితే వెంటనే నీడకు చేర్చి, తడి గుడ్డతో ఒళ్లు తుడిచి, 108కి కాల్ చేయాలి తెలిపారు. అలాగే"సెలవులు అంటే టీవీ, మొబైల్‌కే పరిమితం కాకుండా పుస్తకాలు చదవడం, చిన్న చిన్న హాబీలు నేర్చుకోవడం మంచిది" అని స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూచించారు.

## ఉపరాష్ట్రపతి నే కలిసిన ఏమ్మా నాయనయా మంత్రి రామ్మోహన్



**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఉప రాష్ట్రపతి సిపి. రాధాకృష్ణన్ ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. వికసిత్ భారత్‌పై ఆయన దూరదృష్టి, వివిధ అంశాలపై అందించిన విలువైన సూచనలు ఎంతో ప్రేరణనిచ్చాయన్నారు.

అధికారిక బాధ్యతల్లోనే కాకుండా, ఆయన అందించిన మార్గదర్శకతతో పాటు జీవితంపై ఇచ్చిన విలువైన పాఠాలకు నేను ఎప్పటికీ ఋణపడి ఉంటానన్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు

# అక్రమంగా కలప తరలిస్తే కఠిన చర్యలు

**- అనుమతిలేని అక్రమ కలప రవాణాదారులపై సుమారు 6 లక్షలు పైగా అపరాధ రుసుము వసూళ్లు..అటవీ శాఖ రేంజ్ అధికారి.బి.కోటేశ్వరరావు**



**అరకులోయ , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా కలపలు రవాణా చేస్తే కఠిన శాఖపరమైన చర్యలు తప్పదని, అరకులోయ అటవీ శాఖ రేంజ్ అధికారి బి.కోటేశ్వరరావు ఒక పత్రిక ప్రకటనలో హెచ్చరించారు.. మంగళవారం అక్రమంగా రవాణా చేస్తున్న నీలగిరి చెట్ల భారీ వాహనాన్ని అడ్డుకొని 84,819 రూపాయలు అపరాధ రుసుము జరిమానా విధించామని ఆయన స్పష్టం చేశారు... మార్చి, ఏప్రిల్ 2 నెలల్లోనే అక్రమ రవాణా కలప రవాణా చేస్తున్న భారీ వాహనాలను ఛేదించి సుమారు 6 లక్షల రూపాయలు పైబడి అపరాధ రుసుము ఫైన్ విధించామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అరుకులోయ ఆటవి శాఖ పరిధిలో అధికారుల అనుమతులు లేకుండా కలపలు అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఆయన అన్నారు. తోటలు పెంచే రైతులు అటవీ శాఖ అధికారుల అనుమతులు పొందకే కలప రవాణా చేసుకోవాలని, లేని పక్షంలో అపరాధ రుసుము చెల్లించవలసి ఉంటాదని ఆయన అన్నారు.. చంపగుడ రైతు ప్రభుత్వ అనుమతులు లేకుండా దళారుడుని నమ్ముకొని ఏపీ 39. 3477 వాహనంలో రాత్రి సమయంలో తరలిస్తుండగా వాహనాన్ని అడ్డుకున్నామని, 84, 819 రూపాయలు అపరాధ రుసుము విధించామని ఆయన స్పష్టం చేశారు.. కలప రవాణా దారులు రెవెన్యూ శాఖ అనుమతులు, అటవీశాఖా అనుమతులు పొందాకే కలప రవాణా చేయాలని, లేనియెడల కఠిన శాఖ పరమైన చర్యలు తప్పదని అరకు రేంజ్ అటవీ శాఖ అధికారి బి.కోటేశ్వరరావు ఒక పత్రిక ప్రకటనలో హెచ్చరించారు.

# తెనుగుపూడి జడ్.పి.హెచ్.ఎస్ లో ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం వేడుకలు

**- షేక్స్పియర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు అవగాహన**



**దేవరాపల్లి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు డి.ఎస్.ఎస్.వి. ప్రసాద్, ఉపాధ్యాయులు షేక్స్పియర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి. ఇది భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది" అని పిలుపునిచ్చారు. ఆంగ్ల ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, "ఇంగ్లీష్ ప్రపంచ భాష.

దీనిపై పట్టు సాధిస్తే కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి" అని అన్నారు. షేక్స్పియర్ రచించిన కామెడీ, ట్రాజెడీ నాటకాలు, ఆయన సాహిత్య ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఇంగ్లీష్ నేర్చుకునే సులభ పద్ధతులను కూడా సూచించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకటరమణను శాలువా, పండ్లు, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు .కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మహేశ్వరరావు, త్రినాథ్, మాధవరావు, జగన్, మనోహర్, కొండమ్మ, పద్మావతి, సుగుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# విలాసవంతమైన మోటరోలా ఎడ్జ్ 70 ప్రో కేవలం 36,999 లకె




**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మొబైల్ టెక్నాలజీ, ఆవిష్కరణలలో ప్రపంచ అగ్రగామిగా, భారతదేశ ప్రముఖ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌గా ఉన్న మోటరోలా, ఈ రోజు మోటోరోలా ఎడ్జ్ 70 ప్రో ను విడుదల చేసింది. అధునాతన తక్కువ-కాంతి ఫోటోగ్రఫీ, లీనమయ్యే విజువల్స్, నెక్స్ట్-జెన్ ఆన్-డివైస్ ఏఐ తో వినియోగదారులు 'సీజ్ ది నైట్' (రాత్రి పూట కూడా చక్కటి ఫోటోలు, వీడియోలు తీసుకునేందుకు) చేయడానికి ఇది రూపొందించబడింది. ఈ పరికరంలో మోటో ఏఐ తో కూడిన అధునాతన సోనీ-లైటియా™710 కెమెరా నేతృత్వంలోని ట్రిపుల్ 50 ఎంపీ ప్రో-గ్రేడ్ కెమెరా సిస్టమ్ ఉంది. ఇది అద్భుతమైన రాత్రి ఫోటోగ్రఫీ, అత్యుత్తమ తక్కువ-కాంతి స్పష్టత, మసక లేని షాట్లు, పాంటోన్™వాలిడేటెడ్ ట్రూ కలర్స్, స్కిన్‌టోన్™కచ్చితత్వంతో పాటు, అన్ని కెమెరాలలో 4కె 60 ఎఫ్ పి ఎస్ వీడియోను అందిస్తుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 8500 ఎక్స్‌ట్రీమ్ ద్వారా శక్తిని పొందిన ఇది, అధునాతన ఆన్-డివైస్ ఏఐ ప్రాసెసింగ్‌తో తక్కువ-కాంతి ఇమేజింగ్‌ను మరింత మెరుగుపరుస్తుంది. మోటరోలా ఎడ్జ్ 70 ప్రో, పాంటోన్™ క్యూరేటెడ్ రంగులలో విలాసవంతమైన శాటిన్-లక్స్, టెయిలర్డ్ ఫ్యాబ్రిక్, మార్బుల్ ఫినిషింగ్‌లను కలిగి ఉన్న సరికొత్త 'కలెక్షన్స్ బై మోటరోలా' డిజైన్‌ను కూడా పరిచయం చేస్తోంది. దీనికి జతగా, అద్భుతమైన 144 హెచ్ జెడ్ 1.5కె ట్రూ కలర్™ క్వాడ్-కర్వ్ పాంటోన్™ వాలిడేటెడ్ ఎక్స్‌ట్రీమ్ అమోల్డ్ డిస్‌ప్లే ఉంది. 90 డబ్ల్యు టర్బోపవర్™ఛార్జింగ్, ఐ పి 68 ఀ ఐ పి 69 మన్నికతో కూడిన భారీ 6500 ఎం ఏ హెచ్ సిలికాన్-కార్బన్ బ్యాటరీతో, ఇది నిజమైన ఫ్లాగ్‌షిప్-గ్రేడ్ స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని అందిస్తుంది. ఈ ఆవిష్కరణ సందర్భంగా మోటరోలా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ టి.ఎం. నరసింహన్ మాట్లాడుతూ "మోట రోలాలో మేం, నేటి వినియోగదారులు ఎలా జీవిస్తున్నారు, సృష్టిస్తున్నారు, కనెక్ట్ అవుతున్నారు అనే దానిపై లోతైన అవగాహనతో పాటు ప్రయోజనాత్మక ఆవిష్కరణలను మేళవించడం ద్వారా సంప్రదాయ సరిహద్దులను సవాలు చేస్తూనే ఉన్నాం.

మోటరోలా ఎడ్జ్ 70 ప్రోతో, మేం ఒక సొగసైన, ప్రీమియం ఫామ్ ఫ్యాక్టర్‌లో అద్భు తమైన తక్కువ కాంతి ఫోటోగ్రఫీ అనుభవం, విలాసవంతమైన ఫినిష్ లతో కూడిన అధునాతన డిజైన్, తెలి వైన ఏ ఐసామర్థ్యాలు, ఫ్లాగ్‌షిప్-స్థాయి పనితీరును అందించడంపై దృష్టి సారించాం. స్పెసిఫికేషన్లకు అతీ తంగా వెళ్లి, వ్యక్తిగతమైన, భావవ్యక్తీకరణతో కూడిన, సులభంగా శక్తివంతమైన అనుభూతిని కలిగించే టెక్నాలజీని సృష్టించా లనే మా నిబద్ధతను ఈ ఆవిష్కణ ప్రతిబింబిస్తుంది. రోజువారీ జీవితాన్ని అర్థవంతమైన రీతిలో ఉన్నతీకరించే ప్రీమియం, డిజైన్-ఆధారిత, ఏఐ-ఆధారిత అనుభవాలను అందించే మా ప్రయాణంలో ఇది మరో ముఖ్యమైన మైలురాయి" అని అన్నారు. మోటరోలా ఎడ్జ్ 70 ప్రో స్మార్ట్‌ఫోన్, 29నా ఏప్రిల్ 2026 ఆన్ ఫ్లిప్కార్ట్ మోటార్ల ఇన్ , ప్రముఖ రిటైల్ స్టోర్లలో కేవలం ఐ ఎన్ ఆర్ 36,999 ప్రభావపూరిత ప్రారంభ ధరతో అందుబాటులో ఉంటుందన్నారు.

# జాతీయ రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు : విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

**విజయనగరం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** విజయనగరం జిల్లా పూసపాటిరేగ, భోగాపురం పోలీసు స్టేషనులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సందర్శించి, పోలీసు స్టేషను ప్రాంగణాలను, గదులను, రికార్డులు, సిడి ఫైల్స్ ను పరిశీలించి, జాతీయ రహదారిపై ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు స్టేషనులు పరిధిలో జాతీయ రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలను నియంత్రించేందుకు స్టాపర్లు, లైటింగు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ రోజూ విధిగా విజిబుల్ పోలీసింగు నిర్వహించాలని, హెల్మెట్స్ ధారణ, రహదారి భద్రత నియమాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు.

ప్రమాదాల నియంత్రణకు వాహన తనిఖీలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై డ్రంకన్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ఓపెన్ డ్రింకింగు కేసులు నమోదు చేయాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు జైలుశిక్ష విధించబడే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహన తనిఖీల్లో పెండింగు ఈ-చలానాలు ఉన్నట్లుగా గుర్తిస్తే, ఆయా వాహనాలను పెండింగు ఈ-చలానాలు చెల్లించేంత వరకు సీజ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలిపివేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి సెలవుల్లో నూతులు, చెరువుల్లో పిల్లలు ఈతకు వెళ్ళకుండా



చూడాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు గంజాయి, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించి, వాటికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, పోలీసు స్టేషనులోని వివిధ రికార్డులు, సిడీ ఫైల్స్, జనరల్ డైరీ, బెయిల్ బుక్ తనిఖీ చేసి, అధికారులకు దిశా నిర్దేశం చేసారు. రికార్డులు, సిడి ఫైల్స్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తుండాలి, దర్యాప్తు వివరాలను సిసిటిఎన్ఎస్ లో నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. పోలీసు స్టేషను ఎస్పీ తనిఖీ చేసే సమయంలో భోగాపురం సర్కిల్ సిఐ జి.రామకృష్ణ, భోగాపురం పిఎస్ సిఐ కే.దుర్గా ప్రసాద్, పూసపాటిరేగ ఎస్ఐ ఐ.దుర్గా ప్రసాద్, భోగాపురం ఎస్ఐలు పి.పాపారావు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బొంతువలస ఘాటీ రోడ్డుపై వరుస ప్రమాదాలు..సమగ్ర సమీక్షకు ముర్ల వెంకటరమణ డిమాండ్



**చింతవల్లి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో హైవే మార్గాల్లో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని గిరి జనజాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ తెలిపారు. ముఖ్యంగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు బాధాకరమని పేర్కొన్నారు.

జీకేవీధి--కొయ్యూరు మండలాల సరిహద్దులో ఉన్న బొంతువలస ఘాటీ రహదారి తరచూ ప్రమాదాలకు కేంద్రంగా మారుతుండటంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణం సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా జరగలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.రహదారి నిర్మాణంలో నాణ్యత లోపాలు, తగిన పర్యవేక్షణ లేకపోవడం, ఇంజినీరింగ్ ప్రమాణాల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. కొంతమంది గుత్తేదారులు లాభాపేక్షతో వ్యవహరించడం వల్ల పనుల నాణ్యత దెబ్బతింటోందని ఆరోపించారు.పనులు మంజూరు అయిన తర్వాత సరైన సాంకేతిక పర్యవేక్షణ లేకుండానే నిర్మాణాలు కొనసాగుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇంజినీర్ల పర్యవేక్షణ లేకుండా యంత్రాలతో పనులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారని తెలిపారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో హైవే మార్గాల్లో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని గిరి జనజాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ తెలిపారు. ముఖ్యంగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు బాధాకరమని పేర్కొన్నారు.

ఏ అభివృద్ధి పనులైనా చేపట్టేటప్పుడు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం అవసరమని అన్నారు. ప్రాంతీయ పరిస్థితులు, భౌగోళిక స్వభావం వంటి అంశాలపై స్థానికులకు ఉన్న అవగాహనను పరిగణలోకి తీసుకుంటే సురక్షితమైన రహదారులను నిర్మించవచ్చని సూచించారు. ప్రస్తుతం ఈ ఘాటీ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టం చోటుచేసుకుంటున్న నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖలు సమగ్ర సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రహదారి లోపాలను సరిదిద్దడంతో పాటు అవసరమైతే పునఃసమీక్ష చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల ప్రాణభద్రత దృష్ట్యా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు : కె.వి. రమణ

## - ఉషోదయ స్కూల్‌లో 20 రోజుల ఉచిత కోచింగ్ ముగింపు



**దేవరాపల్లి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** "విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధమైతే మంచి ఫలితాలు సులభంగా సాధించవచ్చు" అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ అన్నారు.స్థానిక ఉషోదయ స్కూల్‌లో గత 20 రోజులుగా నిర్వహించిన పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఉచిత కోచింగ్ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.వి. రమణ మాట్లాడుతూ, ఈ నెల 24న ఏపీఆర్జేసీ, 25న పాలీసెట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కోరుపోలు శ్రీను, మండల అధ్యక్షుడు గంగవంశం సంతోష్, అజయ్ ఆధ్వర్యంలో ఈ ఉచిత కోచింగ్ నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న పి.వి. రమణ మాస్టర్ మాట్లాడుతూ, "నిస్వార్థంగా ప్రతి సంవత్సరం గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్న ఐక్యవేదిక సభ్యులను అభినందిస్తున్నాను" అని అన్నారు.వేచలపు అప్పల నాయుడు మాస్టారు మాట్లాడుతూ, "గత సంవత్సరం ఈ కోచింగ్ ద్వారా 20 మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి మండలానికి పేరు తెచ్చారు" అని గుర్తుచేశారు. సిఆర్టీ గంగాధర్ మాట్లాడుతూ, "ఈ సంవత్సరం గత ఏడాది కంటే ఉత్తమ ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలి" అని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా త్రాగునీటి పథకాలు..ట్యాంకులు మాత్రమే ఏర్పాటు..నీరు మాత్రం అందని ద్రాక్ష






**చింతపల్లి, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలో త్రాగునీటి పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ట్యాంకులు, బోర్లు ఏర్పాటు చేసినప్పటికీ, ప్రజలకు నిరంతరంగా త్రాగునీరు అందని పరిస్థితి నెలకొంది. సాయి నగర్, సాడిపేట తదితర ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల కృషితో పథకాలు తీసుకొచ్చినా, నిర్వహణ లోపాల వల్ల అవి పూర్తి స్థాయిలో ప్రయోజనం ఇవ్వడం లేదు. సాడిపేటలో భారీ వ్యయంతో నిర్మించిన ట్యాంకు కూడా నీటి సరఫరా విషయంలో ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతోందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాల సమయంలో ఏర్పాటు చేసిన త్రాగునీటి ట్యాంకులు కూడా నీరులేకుండానే నిలిచిపోవడం గమనార్హం. ఎండ తీవ్రత మధ్య ఉత్సవాలకు వచ్చిన భక్తులు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో ట్రస్టులు నిర్వహిస్తున్న పథకాలు సజావుగా సాగుతుండగా, ప్రభుత్వ పథకాలు మాత్రం నిలకడగా పనిచేయకపోవడం ప్రశ్నలు రేకెత్తిస్తోంది. కనీస నిర్వహణ, పర్యవేక్షణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

# ఉపాధి హామీ పనుల్లో 'ముఖ హాజరు' తిప్పలు - కార్మికుల ఆవేదన



**గూడెంకొత్తవీధి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మండలంలో జీకేవీధి పంచాయతీ పరిధిలోని తిములబంధ గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా 'ముఖ హాజరు' విధానం కారణంగా కార్మికులు పనులు చేయడంలో, హాజరు నమోదు చేయడంలో తిప్పలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తుల వివరాల ప్రకారం, ప్రతిరోజూ పనికి వచ్చినప్పుడు మొబైల్ ద్వారా ముఖ హాజరు నమోదు చేయాల్సి ఉండటంతో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాలు పెద్ద సమస్యగా మారాయి. చాలాసార్లు ముఖ గుర్తింపు సరిగా పనిచేయకపోవడంతో హాజరు నమోదు కాకపోవడం, చేసిన పనికి కూలి రాకపోతుందనే ఆందోళన కార్మికుల్లో నెలకొంది.

ప్రత్యేకంగా వృద్ధులు, గిరిజన ప్రాంతాల కార్మికులు ఈ విధానాన్ని వినియోగించడంలో మరింత ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం లోపం, స్మార్ట్‌ఫోన్ సౌకర్యాల కొరత కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి."రోజంతా కష్టపడి పని చేసినా హాజరు పడకపోతే కూలి ఎలా వస్తుంది?" అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యను గుర్తించి తక్షణం పరిష్కారం చూపాలని, 'ముఖ హాజరు' విధానంలో సడలింపులు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ పరిస్థితులు కొనసాగితే గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలు దెబ్బతినే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎండలకు స్వాంతన తాటి ముంజలు: దేవరాపల్లిలో జోరుగా అమ్మకాలు



**దేవరాపల్లి , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** వేసవి ఎండలు మండిపోతుండటంతో సహజ సిద్ధమైన చలువనిచ్చే తాటి ముంజలకు గిరాకీ ఒక్కసారిగా పెరిగింది. దేవరాపల్లి ప్రధాన కూడలి, బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచే ముంజల బళ్లు దర్శనమిస్తున్నాయి. స్థానిక వ్యాపారి పారిశెట్టి 'మనం న్యూస్'తో మాట్లాడుతూ, "రోజూ 500 నుంచి 600 కాయలు అమ్ముతున్నాం. ఒక్కో కాయలో 3 ముంజలు ఉంటాయి. డజన్ ముంజలు ?50 వరకు అమ్ముతున్నాం. పట్టణం నుంచి కూడా జనం వచ్చి కొంటున్నారు" అని తెలిపారు.వైద్యుల సూచనల ప్రకారం తాటి ముంజల్లో 87% నీరు, పొటాషియం, జింక్ లాంటి ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. "డీహైడ్రేషన్, వడదెబ్బ నుంచి కాపాడతాయి. షుగర్ పేషెంట్లు కూడా మితంగా తీసుకోవచ్చు" అని దేవరాపల్లి పీహెచ్సీ డాక్టర్ పూజ్య మేఘన సూచించారు.అయితే రోడ్డు పక్కన అమ్మే ముంజలను శుభ్రమైన నీటితో కడగాలని, తొక్క తీసిన వెంటనే తినాలని వినియోగదారులు కోరుతున్నారు. చెట్టు నుంచి దింపే కూలీల కొరత, రవాణా ఖర్చుల వల్ల గతేడాది కంటే ధర 20% పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు - జంగం జోషి



**ఆనందపురం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆనంద పురం మండలం వేములవలసలోని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యాలయంలో నూతన లైబ్రరీ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ అడ్వైజర్ కోన ప్రకాష్ వివిధ రకాల పుస్తకాలను లైబ్రరీకి బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి జ్ఞానాన్ని పెంపొందించే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పఠన అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. సాఫ్ట్వేర్ ఉద్యోగి జంగం ప్రశాంత్ మాట్లాడుతూ "తలదించుకుని పుస్తకాలు చదివితే, తల ఎత్తుకునే స్థాయికి తీసుకెళ్తాయి" అని అన్నారు. పుస్తకాలకు మించిన గురువులు లేరని, అవి మన జీవితాన్ని మారుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి పడాల వినోద్, గొట్టుముక్కల రఘుబాబు, గౌరీ శంకర్, ఆఫీస్ సిబ్బంది సరస్వతి తదితరులు పాల్గొన్నారు. ఈ లైబ్రరీ ప్రారంభంతో గ్రామంలో పఠన సంస్కృతి మరింత పెరుగుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అవంతి లో పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రానికి ఉచిత బస్సు సౌకర్యం




**తగరపువలస, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25 వ తేదీన జరగబోయే (పాలిటెక్నిక్ ) ఎంట్రన్స్ పరీక్ష రాసే విద్యార్థుల కోసం అవంతి కళాశాలల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం, ఆనందపురం పరిసర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్సు డ్రైవర్స్ ఈశ్వరరావు -- ( బస్ నెంబర్. 14 ) 79977 59839, మేఘాలరావు -- ( బస్ నెంబర్. 15 ) 99855 70078 హనుమంతవాక, విశాఖపట్నం ఉదయం 07:30 మరియు 08:00 గంటలకు, శంకరరావు -- ( బస్ నంబర్. 05 ) 94909 39889 విజయనగరం ఉదయం 07:30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని అలాగే మరిన్ని వివరాలకు పైన తెలిపిన ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యాన కార్మికుల నిరసన



**విజయనగరం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం ఆర్‌టిసి విజయనగరం డిపో గేటు వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు కె.రఫీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్మికుల సమస్యలను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా డిపో మేనేజర్ స్పందించడం లేదని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, డిపో కార్యదర్శి ఎ.చంద్రయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగుల అవసరాలకు లీవ్ ఇవ్వాలని, కొత్త టిమ్ యంత్రాలు వెంటనే తెప్పించాలని డిమాండ్‌చేశారు. సిబ్బంది భోజనశాల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఫ్యాన్లు రిపేర్ చేయించాలని, కొత్త డ్యూటీ చార్ట్లు వేయాలని కోరారు. బుకింగ్ చార్ట్ వద్ద అవకతవకలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం ఆర్‌టిసి విజయనగరం డిపో గేటు వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు కె.రఫీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకట్రావు, నాయకులు కె.ఆర్.లక్ష్మి, బి.లక్ష్మి, పి.జగదీష్, జెఎస్ నారాయణ, కెఆర్ కుమార్, బిఆర్.కుమార్, ఎస్‌బి.నాయుడు, సురేష్, బిఎస్ రావు, కెటి రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం మండలంలో స్వచ్ఛ రథం సేవలు..పరిశుభ్రతకు నూతన దిశ



**ఆనందపురం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ రథం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్త నిర్వహణను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు.ప్రత్యేకంగా పొడి ఘన వ్యర్థాల సేకరణపై దృష్టి సారిస్తూ, స్వచ్ఛ రథం గ్రామాల వీధి వీధికి, ఇంటింటికి వెళ్లి పనికిరాని ప్లాస్టిక్, పేపర్ మరియు ఇతర ఘన వ్యర్థాలను సేకరిస్తోంది. ప్రజలు ఇచ్చిన వ్యర్థాల విలువ మేరకు నిత్యావసర సరుకులు అందజేయడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది.అలాగే ప్రతి గురువారం స్వచ్ఛ రథం గ్రామంలోని పాఠశాలలను సందర్శించి, అవసరం లేని పుస్తకాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి, వాటి విలువకు అనుగుణంగా విద్యార్థులకు తినుబండారాలు, పెన్నులు, పెన్సిల్స్ వంటి సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత పెరుగుతుండగా, ప్రజల్లో చెత్త వర్గీకరణపై అవగాహన కూడా పెరుగుతోంది. ఆనందపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి జానకి కోలవానిపాలెం గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు. అలాగే ప్రజలు ఈ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.గ్రామాలు పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంలో స్వచ్ఛ రథం కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు తెలిపారు. ప్రజలు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## రైతుల మీద ప్రేమ ఉంటే..జగన్ అసెంబ్లీలో మాట్లాడాలి



**లావేరు , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** రైతుల మీద ఏమాత్రం ప్రేమ ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ అసెంబ్లీ కి వచ్చి మాట్లాడాలని ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు అన్నారు ఈ సందర్భంగా ఆయన జిల్లా సర్వసభ్య సమావేశంలో గురువారం పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విధాలుగా మోసం చేసింది వైయస్సార్ ప్రభుత్వమేనని తెలిపారు సంక్షేమం అభివృద్ధి పక్కన పెట్టి ఓట్లు ఏరా వేసుకోవడానికి గతంలో ఉపయోగం లేని పథకాలు పెట్టారని చెప్పారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వ వైద్య విద్య మంచినీరు సాగునీరు గ్రామ అభివృద్ధి కోసం పాటుపడుతుందని తెలిపారు అదేవిధంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తక్షణమే అధిగమించాలని జిల్లా యంత్రాంగానికి చెప్పడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు జడ్పిటిసిలు పాల్గొన్నారు

## సైకాలజీ, అనారోగ్య సమస్యల పరిష్కారానికి కేరళ వైద్య శిబిరం

**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** కేరళకు చెందిన సైకాలజీ కౌన్సిలర్ డాక్టర్ అథిరా కే.ఏ ఆధ్వర్యంలో మానసిక సమస్యలపై కౌన్సిలింగ్ ప్రక్రియను ఈనెల 25 నుంచి 29 వరకు మురళి నగర్, రాంనగర్ లలో గల తమ వైద్యరాజ్ ఔషధాలయ లో నిర్వహిస్తున్నట్లు మేనేజర్ దినూప్ తెలిపారు. చర్మ వ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, సోరియాసిస్, వత్తిడి, ఈ ఎన్ టి సమస్యలు, హైపర్ టెన్షన్ (ఆందోళన) , ఆర్థరైటీస్ (కీళ్ళ వ్యాధులు ), నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక వత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ ఉన్నికృష్ణన్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. డాక్టర్ ను సంప్రదించాలనుకునే వారు ఏప్రిల్ 25,26,27 తేదీల్లో మురళీ నగర్ శ్రీదేవి పార్క్ సమీపంలోనూ, 28,29 తేదీల్లో రాంనగర్ జి వి ఎం సి అవుట్ గేట్ ఎదురుగా గల వైద్యరాజ్ ఔషధాలయా లో సేవలు పొందవచ్చునని మేనేజర్ దినూప్ తెలిపారు. ఈ శిబిరంలో మానసిక సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకి చికిత్స అందిస్తామని తెలిపారు. వివరాలకు 800800670 లేదా 7675861446 లలో సంప్రదించాలి.

## చట్టాన్ని గౌరవించి, చట్టబద్ధంగా వ్యవహించే వారికి మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగు : విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** విజయనగరం జిల్లా డెంకాడ పోలీసు స్టేషన్ను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, సందర్శించి, పోలీసు సిబ్బంది విశ్రాంతి తీసుకొనేందుకు నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదులను, ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంను, చలివేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ - పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలు, పురుష పోలీసు సిబ్బంది విశ్రాంతి తీసుకొనేందుకు వేరువేరుగా నిర్మించిన విశ్రాంతి గదులను, పోలీసు స్టేషనుకు ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజల సౌకర్యార్థం నిర్మించిన సహాయక కేంద్రంను, చలివేంద్రంను ప్రారంభించామన్నారు. విశ్రాంతి గదులను, సహాయ కేంద్రంను నిర్మించేందుకు సహాయపడిన ప్రతీ ఒక్కరిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విశ్రాంతి గదులను పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని, వాటిని బాధ్యతతో ప్రతీ రోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేసవి ఎండల నుండి ఉపశమనానికి, ప్రజల దాహాన్ని తీర్చేందుకు పోలీసు స్టేషను ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను కూడా ప్రారంభించి, ప్రజలకు జిల్లా ఎస్పీ మజ్జిగను పంపిణీ చేసారు. వేసవి ఎండలు తగ్గేంత వరకు చలివేంద్రంను కొనసాగించాలని అధికారులకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సూచించారు. డెంకాడ పోలీసు స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాలను నియంత్రణకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నా యన్నారు. రహదారి ప్రమాదాలు గణనీయంగా తగ్గాయన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన స్టాపర్లు రాత్రి సమయాల్లో వాహనదారులకు కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు రహదారి భద్రతపట్ల అవగాహన కల్పించాలని, ప్రతీ ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలన్నారు. వాహనాల బ్యాటరీలు చోరీకి గురికాకుండా నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వాహనాలు నిలిపి వేయకుండా చూడాలని, హైవే పెట్రోలింగు సిబ్బంది వీటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ప్రమాదాలకు కారణం కాకుండా వాహనాలు రహదారులపై నిలపకుండా చూడాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, బుష్ లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. చట్టాన్ని గౌరవించే ప్రజలతో పోలీసులు ఫ్రెండ్లీగా వ్యవహించాలని, చట్టాన్ని వ్యతిరేకించే వారివట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతీ రోజూ విధిగా విజిబుల్ పోలీసింగు నిర్వహించాలని, హెల్మెట్ ధారణ, డిజిటల్ అరెస్టు, మహిళలు, రహదారి, సైబరు భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు వాహన తనిఖీలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై డ్రంకన్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ఓపెన్ డ్రింకింగు కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ భోగాపురం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా ఎస్పీ వెంట విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఎన్.రాఘవులు, భోగాపురం సిఐ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## పోషణ పక్వాడతో గ్రామాల్లో ఆరోగ్య చైతన్యం




**ఆనందపురం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలంలోని వేములవలస-1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్తుల్లో, ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లల తల్లుల్లో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైకె రాజు కళాబృందం ప్రత్యేక కళాజాత నిర్వహించి బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టం, మహిళ సాధికారత, మహిళలు మరియు పిల్లల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై సులభంగా అర్థమయ్యే విధంగా ప్రజలకు వివరించారు. ఈ ప్రదర్శనలు గ్రామస్తులను ఆకట్టుకోవడంతో పాటు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. పిల్లల పోషణలో తల్లిదండ్రుల పాత్రపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పిల్లలకు జంక్ ఫుడ్ అలవాటు పెరగకుండా ఇంట్లో తయారు చేసిన పోషకాహారం ఇవ్వాలని సూచించారు. పండ్లు, కూరగాయలు, పాలు వంటి ఆహార పదార్థాలు పిల్లల ఎదుగుదలకు ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేములవలసకు చెందిన లబ్ధిదారుడైన మన్మథరావు తన కుమార్తె తనుశ్రీకి ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తూ మంచి తల్లిదండ్రిగా నిలిచినందుకు "సూపర్ డాడీ"గా గుర్తించి ప్రత్యేక బహుమతి అందజేశారు. ఈ సత్కారం కార్యక్రమానికి హాజరైన వారిని ప్రేరేపించింది. ఈ కార్యక్రమంలో గంభీరం సెక్టార్ సూపర్వైజర్ శిరీష, ఏఎన్ఎం,అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కొమ్మాది ప్రైమరీ పాఠశాల వార్షికోత్సవం




**ఆనందపురం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** మధురవాడకు సమీపంలోని కొమ్మాది మోడల్ ప్రైమరీ పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కొమ్మాది గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో వార్షికోత్సవం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో దీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్ ఉపాధ్యాయులు కె. కృష్ణయ్య, పల్లి పద్మజ, ఇమంది సత్యవాణి గ్రామ పెద్దలు, స్కూల్ కమిటీ సభ్యులు మరియు తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హాజరు మార్కులు గణనీయంగా సాధించినందుకు బహుమతులు మరియు ప్రగతి కార్డులను ముఖ్య అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది గోలగాని సన్యాసిరావు, జనసేన నాయకులు సునీల్ మనోహర్, స్థానిక నాయకులు సియాద్రి కనకరాజు, తాతారావు, పైడిరాజు, దాసు, చైర్మన్ గౌరీ, వైస్ చైర్మన్ సతీష్ హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ పట్నాయక్ ఆధ్వర్యంలో టీచర్లు కృష్ణయ్య, పద్మజ, సత్యవాణి, ముక్కుకోటిలక్ష్మి, ప్రియా తదితరులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామస్థుల మధ్య ఆనంద వాతావరణాన్ని సృష్టించింది.

## గీతంలో ఫైజర్ ఉన్నత స్థాయి బృందం పర్యటన



**భీమునిపట్నం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఉత్తరాంధ్ర జిల్లాలలోని గ్రామీణ ప్రాంత బాలికలకు విద్యా, ఉపాధి అవకాశాలను కల్పించడంలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత ఔషధ పరిశ్రమ ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా ఫైజర్ అటానమస్ టీమ్స్ (ప్యాట్) పేరిట నిర్వహిస్తున్న కోర్సులను సమీక్షించడానికి ఫైజర్ ఉన్నత స్థాయి నిపుణుల బృందం గురువారం గీతంను సందర్శించింది. ప్రస్తుత విద్యా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం మరియు భవిష్యత్ ప్రణాళికలపై చర్చించడం ముఖ్య ఉద్దేశ్యంగా నిపుణులు గీతం విశ్వవిద్యాలయం అధికారులతో సమావేశం అయ్యారు. ఫైజర్ అటానమస్ టీమ్స్ (ప్యాట్) పేరిట గీతంలో ఫైజర్ స్పాన్సర్షిప్తో 337 మంది గ్రామీణ బాలికలకు బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సు చదవడానికి అలాగే ఉద్యోగంతో పాటు డిగ్రీ పూర్తి చేసేంతవరకు ఫైజర్ కంపెనీ సహాయం అందిస్తోంది. గీతం సందర్శించిన ప్రతినిధి బృందంలో ఫైజర్ గ్లోబల్ హస్పిటల్ మరియు బయోసిమిలర్స్ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ ఉపాధ్యక్షుడు మెక్ నికోలస్ మారియస్, ఫైజర్ గ్లోబల్ సప్లై వైజాగ్ సైట్ లీడర్ కట్టా రవిచంద్ర, పిజిఎస్ ఇండియా పీపుల్ ఎక్స్పీరియన్స్ డైరక్టర్ టి.రవి కిరణ్, ఆర్.డి.ఎమ్.ప్రొక్యూర్మెంట్ డైరక్టర్ ఆకాంక్ష పండిట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతం వైస్ ఛాన్స్లర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ విద్యాలయాలకు పరిశ్రమలకు మధ్య ఏర్పడే సంబంధాలు నైపుణ్యం గల మానవ వనరులను దేశానికి అందించడంలో సహాయ పడతాయన్నారు. స్థానిక పరిశ్రమలకు అవసరమైన మేధో సహకారాన్ని అందించడానికి గీతం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంతరామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెస్సీ కోర్సుల నిర్వహణకు సహితం ఫైజర్ ద్వారా తాము ఔషధ పరిశ్రమల కోసం రూపొందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమం లో గీతం రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్.వేణుగోపాల్, కోర్సు కో-ఆర్డినేటర్లు డాక్టర్ అలిస్ ఆర్.రాబర్ట్, డాక్టర్ జి.రవికుమార్, గీతం అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు పీఎంసీఎస్, ఎల్ నినో పద్ధతులు పాటించాలి : జెడిఏ అన్నపూర్ణ



**పార్వతీపురం , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రతి రైతు వ్యవసాయ సేద్యంలో పీఎంసీఎస్, ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకునే పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి (జేడీఏ) అన్నపూర్ణ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బందలుప్పి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడిఏ అన్నపూర్ణ మాట్లాడుతూ .... ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే నష్టాలను అధిగమించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని గణనీయంగా పెంచుకోవచ్చున్నారు. ఆకుకూరలు, దుంప జాతి పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చున్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, పెట్టుబడి భారాన్ని తగ్గించుకోవచ్చున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రైతులు, మహిళా రైతులు మరియు యువత భాగస్వాములై ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ఆమె కోరారు. ఇది కేవలం నేల ఆరోగ్యానికే కాకుండా, మన కుటుంబాల ఆరోగ్యానికి మరియు పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి అశోక్ మాట్లాడుతూ, అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల నేల తన సహజత్వాన్ని కోల్పోయి నిస్సారంగా మారుతోందని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారానే భూమిని కాపాడుకోగలమని వివరించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డి.పి.ఎం) ఎం. శ్రావణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రతి రైతు కనీసం అర ఎకరాలోనైనా పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. తొలకరి వానలకు ముందే నవధాన్యాలు జల్లుకోవడం వల్ల నేలకు అవసరమైన స్థూల మరియు సూక్ష్మ పోషకాలు అందుతాయని తెలిపారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండేందుకు సిబ్బంది వద్ద 'నవధాన్యాల కిట్లు' సిద్ధంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎఫ్.ఏ తిరుపతి, ఎఫ్.ఎమ్.టి,ఎన్ గంగరాజు,ఎన్.పి.పిలు, గ్రామ పెద్దలు శంకరాపు శంకరరావు, బోను శ్రావణ, బబ్బాది సూర్యనారాయణ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల నిరసనలు

**విజయనగరం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనాలు చెల్లించాలని, మే నెలలో వేసవి సెలవులు ప్రకటించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు జిల్లాలో పలుచోట్ల గురువారం నిరసనలు చేపట్టారు. విజయనగరంలోని కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు కూడలి మీదుగా గంట స్థంభం వరకు ర్యాలీ నిర్వహించారు.




ర్యాలీని ఉద్దేశించి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ప్రభావతి, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యుఎస్ రవికుమార్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వేసవి సెలవులు నెల రోజులు ఇస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని చెప్పిన టిడిపి కూటమి నాయకులు.. గద్దెనెక్కి దాదాపు 22 నెలలు కావస్తున్నా అంగన్వాడీల గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో చిన్నారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో వైపు జిఒ 5ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెలలో రాష్ట్ర కేంద్రంలో అంగన్వాడీలు ధర్నా చేస్తే పది రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన పెద్దలు నెలరోజులు దాటినా ఇంతవరకు సమాధానం చెప్పలేదన్నారు. తక్షణమే అంగన్వాడీలకు కనీస వేతనాలు ప్రకటించి, వేసవి సెలవులు నెల రోజులు ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుశీల, రాధ, సిఐటియు నాయకులు బి.రమణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. బొబ్బిలి టౌన్ : సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని బొబ్బిలి పట్టణంలోని వేణుగోపాల స్వామి కోవెల సెంటర్ నుంచి ఎన్‌టిఆర్ బొమ్మ కూడలి వరకు అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యాన ప్రదర్శన చేపట్టారు. అనంతరం నిరసన తెలిపారు. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు జె.కామేశ్వరి, సిఐటియు జిల్లా నాయకులు సింగిరెడ్డి గోపాలం మాట్లాడారు. ర్యాలీని ఉద్దేశించి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ప్రభావతి, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యుఎస్ రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి.లక్ష్మి, అంగన్వాడీ లు పాల్గొన్నారు. భోగాపురం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో భోగాపురం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జి.ప్రవీనా, ఎస్.శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అగ్రస్థానమే లక్ష్యం



**విజయనగరంకోట , ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ప్రభుత్వ ప్రాధాన్యత సూచికల అమల్లో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల పనితీరును సమీక్షించిన కలెక్టర్... నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని శాఖలు తప్పనిసరిగా ఎ-ప్లస్ గ్రేడ్ సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ కావడంలో కెపిఐ కీలకమని, ఆయా సూచీల్లో వెనుకబడిన శాఖలు తక్షణమే పురోగతి సాధించాలని సూచించారు. అంతకుముందు ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పియూష్ కుమార్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పియూష్ కుమార్ మాట్లాడుతూ మండలాలకు నిర్దేశించిన 199 ఇండికేటర్స్‌లో మెరుగైన పనితీరును ప్రదర్శించాలన్నారు. 29వ తేదికి అన్ని నివేదికలను సమగ్రంగా అందజేయాలని చెప్పారు. జిఎస్‌డిపి లక్ష్యాలను వివరించారు. 1, 2, 3వ సవరించిన అంచనాలకు అనుగుణంగా మండలాల వారీగా కూడా ఎండిపిల అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఒ పి.బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి సెలవులు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్త అంగన్వాడీల నిరసనలు

**విజయనగరం, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) :** ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స యూనియన్ ఆధ్వర్యంలో వేసవి సెలవులు మే నెల మొత్తం ఇవ్వాలని, ప్రభుత్వం పెంచుతామన్నా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వెంటనే వేసవి సెలవులు నెలరోజులు ఇస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 21 నెలలు కావస్తున్న అంగన్వాడి లు గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో వైపు జీఓ5 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ లను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెలలో రాష్ట్ర కేంద్రంలో అంగన్వాడీ లు ధర్నా చేస్తే పదిరోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన పెద్దలు నెలరోజులు దాటిన ఇంతవరకు మా సమస్యలపై సమాధానం చెప్పలేదన్నారు. తక్షణమే అంగన్వాడీ లు కు కనీస వేతనాలు ప్రకటించి, వేసవి సెలవులు నెలరోజులు ప్రకటించాలని పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

**విజయనగరం జిల్లా :**

స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, మీదుగా గంట స్థంభం వరకు ర్యాలీ నిర్వహించారు.